క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



రజత్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న లక్ష్మి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన జి.లక్ష్మి ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డిని గురువారం నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు లక్ష్మీసునంద, పామూరు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

బాలుడి ప్రతిభ



బాలుడిని అభినందిస్తున్న కలెక్టర్

నెల్లూరు రూరల్: నెల్లూరుకు చెందిన సోమేష్ రూబిక్ క్యూబ్స్ మార్చడంలో ప్రతిభ చూపాడు. 7వ తరగతి చదువుతున్న ఈ బాలుడు గురువారం కలెక్టర్ ఆనంద్ సమక్షంలో 13.8 నిమిషాల్లో 16 రూబిక్ క్యూబ్స్ మార్చాడు. క్యూబ్‌లపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటోను అమర్చి కలెక్టర్‌కు అందజేశాడు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నారు. 4వ రోజు ఉదయం నిత్యహోమాలు, సాయంత్రం స్వామి గోపురోత్సవం, రాత్రి హోమాలు జరిగాయి. ఉభయకర్తలుగా అరణికందప్ప మేస్త్రి సత్రం కార్యనిర్వహణాధికారి వ్యవహరించారు. కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

బీజేపీ మీడియా ఇన్‌చార్జి నియామకం



నెల్లూరు రూరల్: బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జిగా చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి గురువారం స్థానిక కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. శ్రీనివాసులురెడ్డి గతంలో రైల్వే కన్సల్టేటివ్ సభ్యుడిగా పనిచేశాడు. ఆయన్ను నేతలు గడ్డం విజయ్‌కుమార్ యాదవ్, యశ్వంత్ సింగ్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

ఫెన్సింగ్ రాళ్ల ధ్వంసంపై కేసు నమోదు

పొదలకూరు: మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన సునంద పొలానికి వేసిన ఫెన్సింగ్ రాళ్లను అదే గ్రామానికి చెందిన ఐదుగురు బుధవారం రాత్రి ధ్వంసం చేసినట్టు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్సై హనీఫ్ కథనం మేరకు.. సునంద ఇటీవల తనకు చెందిన 1.60 ఎకరాల పొలానికి రూ.1.50 లక్షలు వెచ్చించి ఫెన్సింగ్ వేసుకున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన వారు పొలం వివాదంలో భాగంగా పెద వెంకటేశ్వర్లు, రామయ్య, పి.వెంకటేశ్వర్లు, సుశీల, వీరమ్మ కలిసి సమ్మెట్లతో ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేసి నష్టపరిచారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ కామాక్షితాయి ఆలయం వెలుపల రోడ్డుపై గురువారం గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. ఆమె కొన్నిరోజులుగా ఆలయ పరిసరాల్లోనే ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు వివరించారు.

అద్దె బకాయిలు చెల్లించకుంటే చర్యలు

• కమిషనర్ వైఓ నందన్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల నిర్వాహకులు క్రమం తప్పకుండా అద్దె బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో ఉపేక్షించబోమని కమిషనర్ వైఓ నందన్ హెచ్చరించారు. గురువారం స్థానిక మద్రాస్ బస్టాండ్ ప్రకాశం పంతులు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, చేపల మార్కెట్ సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్, జలపుష్ప భవన్, సౌదాగర్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లోని అద్దె షాపులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అద్దె షాపులను వేలందారులు నిర్వహిస్తున్నారా? లేదా సబ్ లీజుకు ఇచ్చి నిర్వహిస్తున్నారా? అని ఆరాతీశారు. అనంతరం వాకర్స్ రోడ్డు పుట్టా ఎస్టేట్ ప్రాంతంలో జరుగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జోనల్ ఆఫీసర్ ప్రవీణ్, శానిటరీ సూపర్‌వైజర్ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ నందన్

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్ఎస్ఏ రాష్ట్రాధ్యక్షుడు

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) రాష్ట్రాధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులో జరుగుతున్న తహసీల్దార్ల సమావేశం గురించి కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



⇨ జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

సున్నా పేమెంట్ పేరుతో స్కామ్

• కలెక్టరేట్ వద్ద బీజేపీ నేతల నిరసన

నెల్లూరు(అర్బన్): హౌసింగ్ కార్పొరేషన్‌లో జరుగుతున్న అక్రమాలు బయటపడకుండా సున్నా పేమెంట్ పేరుతో అధికారులు స్కామ్‌ను మొదలుపెట్టారని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఆరోపించారు. గురువారం ఆ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేసీతో రమేష్ మాట్లాడుతూ 4,702 గృహాలకు సున్నా పేమెంట్‌తో రూ.70 కోట్ల ఫైనల్ బిల్లులు చెల్లించారని ఆరోపించారు. హౌసింగ్ అధికారులు చేసిన అక్రమాలు నుంచి బయటపడేందుకు జీరో పేమెంట్‌లు చూపిస్తున్నారన్నారు. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



జేసీతో మాట్లాడుతున్న నేతలు

కార్యక్రమంలో నాయకులు పొట్లూరు శ్రీనివాసులు, రఘురామయ్య, నాగేంద్రసింగ్, ఏవీ సుబ్బయ్య, లక్ష్మణరావు, రాములు యాదవ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కుళాయి పన్నుల వసూలు వేగవంతం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని కార్పొరేషన్ టీపీఆర్వో వాసుబాబు, ఇంజినీరింగ్ విభాగం ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ, అనిల్‌కుమార్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇంజినీరింగ్ విభాగం, హౌసింగ్, వార్డు సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గృహాలకు తాగునీటి కనెక్షన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా వాడుతున్న కుళాయిలను గుర్తించి పన్నులు నమోదు చేయాలని సూచించారు. టిడ్కో గృహాల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయించి ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు, డీఈఈలు ప్రసాద్, ముజాహిద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు

బయో మైనింగ్ పద్ధతిలో వ్యర్థాల ప్రాసెసింగ్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అల్లీపురం, దొంతాలి డంపింగ్ యార్డుల్లో ఉన్న వ్యర్థాలు (లెగసీ వేస్ట్) 3,24,479 టన్నులను ప్రైవేట్ సంస్థ ద్వారా బయో మైనింగ్ పద్ధతిలో ప్రాసెసింగ్ చేస్తున్నట్లు కమిషనర్ వైఓ నందన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇప్పటి వరకు 50 శాతం పని పూర్తైందన్నారు. మిగిలిన మట్టిని వివిధ ప్రాంతాల్లో వినియోగిస్తున్నామని తెలియజేశారు. దొంతాలి డంపింగ్ యార్డ్‌లోని మట్టిని సర్వేపల్లి సమీపంలో ఉన్న పిగ్ షెల్టర్స్ స్థలంలో ఉన్న లోతట్టు ప్రాంతాలను లెవలింగ్ చేయడానికి వాడుతున్నట్లు వెల్లడించారు.

నేత్రదానం



విజయకుమార్ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): విడవలూరు మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన నక్కా విజయకుమార్ (49) బ్రెయిన్ స్ట్రోక్‌తో నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో గురువారం మృతిచెందాడు. మనసేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాసులు సూచనతో కుటుంబ సభ్యుడు నక్కా దినేష్ అంగీకారంతో విజయకుమార్ నేత్రాలను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి టెక్నీషియన్ మృతుడి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులను నేత్రదాన సర్టిఫికెట్‌ను అందించారు. నేత్రదానం చేయాలనుకున్న వారు 99595 89321, 94406 10111 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

7న వెంకయ్యస్వామి సన్నిధికి పాదయాత్ర

నెల్లూరు(బారకాసు): సాయి మాలధారణతో ఈనెల 7వ తేదీన గొలగమూడి వెంకయ్యస్వామి సన్నిధికి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సాయిదర్బార్ అద్దాల మందిర చైర్మన్ మధు తెలిపారు. గురువారం పద్మావతి నగర్‌లో ఉన్న మందిరంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సాయి మాలధారణ మండల దీక్ష - షిర్డీ యాత్ర సందర్భంగా 7న ఉదయం 6 గంటలకు సాయిదర్బార్ నుంచి జరిగే పాదయాత్రలో భక్తులు పాల్గొనాలని కోరారు. మహిళలు కాషాయ రంగు వస్త్రాలు, పురుషులు తెలుపు రంగు వస్త్రాలు ధరించాల్సిందిగా తెలియజేశారు. వివరాలకు 95028 49784, 88856 44118 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.



కరపత్రాల ఆవిష్కరణ

పనితీరు అభినందనీయం

నెల్లూరు సిటీ: ఆర్టీసీ ఉద్యోగుల పనితీరు అభినందనీయమని ఈడీ చెంగల్‌రెడ్డి అన్నారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో డిపో-1 గ్యారేజీ వద్ద గురువారం ఆయన సిబ్బంది, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం రవికాంత్, డిప్యూటీ సీఎంఈ జోన్ 3 శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమేష్, కరిమున్నీసా, సునీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈడీ

ఘనంగా పద్యపిపాసి 'మెట్టు' సంస్మరణ సభ

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజంలో గురువారం రాత్రి పద్యకళాపరిషత్ నెల్లూరు సాహితి సంస్థ అధ్యక్షుడు, వీఆర్ కళాశాల విశ్రాంత ఆంధ్రశాఖాధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ సంస్మరణ సభ ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ కుటుంబ సభ్యులు, శిష్యుల ఆధ్వర్యంలో జరిగిన సభలో పలువురు కవులు, సాహితీవేత్తలు, రచయితలు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కవి, పండితులు,సాహితీవేత్తలు ఇనమడుగు సత్యానందాశ్రమ నిర్వాహకు శ్రీహరి తీర్థస్వామి అధ్యక్షతన జరిగిన సభలో కోట శ్రీరామమూర్తి, మాచవోలు రవీంద్రనాథ్‌శర్మ, బద్దెపూడి కుమారశర్మ, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, కొండపి మురళీకృష్ణ,కోట రాజశేఖరం, అగస్త్యరాజు సుబ్బారావు, నలబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొని మాట్లాడారు. గురువుగా,కళాపోషకుడిగా,శివగామిని కావ్యకర్తగా మెట్టు రామచంద్రప్రసాద్ సాహితీలోకానికి, ప్రధానంగా పద్య కళాభివృద్ధికి ఆయన చేసిన కృషి, సేవ మరువరానిదిగా వక్తలు పేర్కొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, కృత్రిమ యూరియా కొరత సృష్టించి దగా చేస్తూ దోచుకుంటోందని వైఎస్సార్‌సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ కొణిదెల సుధీర్ అన్నారు. నెల్లూరు రాంజీ నగర్‌లో ఉన్న నగర నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి యూరియా కొనలేక రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. బ్లాక్‌మార్కెట్ సొమ్ము సుమారు రూ.200 కోట్ల నుంచి రూ.300 కోట్లు చేతులు మారాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈనెల 9వ తేదీన పార్టీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వేపల్లి, నెల్లూరు సిటీ, కోవూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నేతలు, రైతులతో కలిసి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న సుధీర్

రేపట్నుంచి ఆరాధనోత్సవాలు

తోటపల్లిగూడూరు: కోడూరు వేళాంగణి చర్చి ఆరాధనోత్సవాలకు ముస్తాబైంది. సెప్టెంబర్ 8వ తేదీ లోకరక్షకునిగా పేరొందిన ఏసుక్రీస్తు తల్లి వేళాంగణి మాత జన్మదినం. ఈ నేపథ్యంలో ఏటా చర్చిలో సెప్టెంబర్ 6, 7, 8వ తేదీల్లో మూడురోజులపాటు ఆరాధనోత్సవాలు వేడుకగా జరుగుతుంటాయి. 1980లో నిర్మితమైన ఈ చర్చిలో ఏటా వేళాంగణి మాత జన్మదిన ఉత్సవాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఉత్సవాల ఏర్పాట్లకు చర్చి ఫాదర్ ఏర్పాట్లు చేశారు.

మతాలకతీతంగా ప్రార్థనలు

ఇక్కడి ఆరాధనోత్సవాలకు రాష్ట్ర నలువైపుల ఉన్న క్రైస్తవులతో పాటు ఇతర మతాలకు చెందిన భక్తులు కూడా వస్తుంటారు. ఉత్సవాల్లో కీలకమైన వేళాంగణి మాత జన్మదినం నాడు చర్చికి భక్తులు పోటెత్తి వస్తారు. అదే రోజు రాత్రి అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని రాత్రి చర్చిలోనే జాగరణ చేస్తారు. అనంతరం మరుసటి రోజు భక్తులు కోడూరు సాగరతీరంలో పుణ్యస్నానాలు చేసి తమ మొక్కులను తీర్చుకొంటారు.

ఉత్సవ వివరాలు

ఉత్సవాల్లో భాగంగా ఈనెల 6వ తేదీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. రాత్రి ముత్యాలతోపు వరకు వేళాంగణి మాత తేరు ప్రదక్షణ జరుగుతుంది. 7వ తేదీ ఆరాధన-స్వస్తత ప్రార్థనలు, జపమాల నవదిన ప్రార్థనలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి దివ్యబలి పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రి 8 గంటలకు కొత్త కోడూరు వరకు అమ్మవారి తేరు ప్రదక్షణను నిర్వహిస్తారు. చివరిరోజు అమ్మవారి జన్మదినం రోజు 8వ తేదీ పగలంతా ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు సింహపురి పీఠాధిపతి డాక్టర్ ఎండీ ప్రకాశం ఆధ్వర్యంలో ప్రార్థనలు ఉంటాయి.



ఉత్సవాలకు ముస్తాబైన చర్చి

టీచర్స్‌డే వేడుకలు నేడు

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని జీఎస్సార్ కల్యాణ మండపంలో అప్సా ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు చాట్ల నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి నారాయణ, కలెక్టర్ ఆనంద్, కమిషనర్ నందన్, డీఈఓ బాలాజీరావు, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉత్తమ సేవలందించిన పలువురు టీచర్స్‌ను సన్మానించనున్నట్లు తెలియజేశారు.

డిపో మేనేజర్‌గా వెంకటేశ్వర్లు

నెల్లూరు సిటీ: నెల్లూరు డిపో-1 మేనేజర్‌గా జి.వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. డిపో-1 సీఐ సునీత ఇన్‌చార్జి మేనేజర్‌గా ఉన్నారు. ఆమె స్థానంలో ప్రభుత్వ ఆదేశాలతో గూడూరు డిపో మేనేజర్ జి.వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించారు.

సమస్యలపై వినతి

నెల్లూరు రూరల్: కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను గురువారం కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సమావేశానికి కోవూరు రైతులు కూడా హాజరయ్యారు. చక్కెర ఫ్యాక్టరీ రైతులు, ఉద్యోగుల సమస్యలపై చెప్పగా కలెక్టర్ అనుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన తప్పనిసరి

• డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(పొగతోట): పొదుపు మహిళలు ఆర్థిక లావాదేవీలు సక్రమంగా నిర్వహించేలా అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. గురువారం డీఆర్‌డీఏ కార్యాలయంలో 15 మండలాలకు చెందిన సీఆర్పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజకుమారి మాట్లాడుతూ అవసరాలకు తగిన విధంగా ఆర్థిక ప్రణాళికను తయారు చేసుకోవడం, తెలివిగా ఖర్చు, పొదుపు చేయడం, బీమా, పెన్షన్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ రవిచంద్ర, డీపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ

నెల్లూరు(పొగతోట): నెల్లూరు అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని కొండాయపాళెం సెక్టార్‌లో ఉన్న ముత్యాలపాళెం 1, 2, కర్బలమిట్ట అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ బి.హేనాసూజన్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనం, సరుకుల నాణ్యత, పిల్లల బరువు, ఎత్తును పరిశీలించారు. ఈసీసీఈ కార్యక్రమాలను సక్రమంగా నిర్వర్తించాలని, స్టాక్ రిజిస్టర్లు అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. ఆమె వెంట నెల్లూరు అర్బన్ ప్రాజెక్ట్ సీడీపీఓ టి.అరుణ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నెల్లూరు(టౌన్): కార్పొరేషన్ పరిధిలో పదోన్నతి పొందిన వైవీఎం స్కూల్లోని పలువురు టీచర్లకు గురువారం ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మలు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారంలో తమ సంఘం ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, ప్రధాన కార్యదర్శి నరసింహం, ఆర్థిక కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. సూరాయపాళెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి మోటార్‌బైక్‌పై తాటిపర్తికి వస్తుండగా మార్గమధ్యలో బ్రిడ్జి వద్ద బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో కారును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో నాగిరెడ్డి తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు.

పలువురికి కాకాణి పరామర్శ

పొదలకూరు: మండలంలోని కల్యాణపురం, నేదురుమల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కల్యాణపురం నాయకుడు వెన్నపూస దయాకర్‌రెడ్డికి చెందిన బంధువు దశదిన కర్మకు హాజరై నివాళులర్పించారు. నేదురుమల్లి సర్పంచ్ ఉడతా రమేష్ బంధువు దశదిన కర్మకు వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, నాయకులు వెన్నపూస కృష్ణారెడ్డి, ఆకుల గణేష్‌రెడ్డి, రావుల ఇంద్రసేన్‌గౌడ్, వెన్నపూస ఓబుల్‌రెడ్డి, మాలపాటి రమణారెడ్డి, వెన్నపూస యానాదిరెడ్డి, బడుగు శ్రీనివాసులు, శ్రీహరి, పెంచలరెడ్డి, లక్ష్మయ్య, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణపురంలో కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి